బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటుంది మోడీనే..

- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగంలోనే లేవు
- కెసిఆర్ చేసిన చట్టం బిసిలకు శాపంగా మారింది
- దేశంలో ఓట్ల దొంగలు పడ్డారు
- బహుజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సభలో : సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రధాని నరేంద్రమోడీనేనని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహ ఏర్పాటుకు సిఎం శంకుస్థాపన చేశారు. అనంతరం రవీంద్రభారతిలో బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనింగ్ పేరుతో ఖిలాషాపూర్ కోట చరిత్రను కాలగర్భంలో కలిపేందుకు కుట్రలు పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడే కోటపైకి వెళ్లి దాన్ని కాపాడి చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన చట్టం బీసీలకు శాపంగా మారిందన్నారు. దాన్ని సవరిస్తూ చేసిన ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారని తెలిపారు. ఐదు నెల్లు గడిచినా బిల్లులను ఆమోదించకపోవడంతో బహుజనుల కోసం ఢిల్లీలో ధర్నా సైతం చేశామని గుర్తు చేశారు. బహుజనుల కోసం తాము చేసిన ధర్నాకు బిజెపి, బిఆర్ఎస్ నేతలు ఎందుకు రాలేదంటూ సిఎం నిలదీశారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగంలోనే లేవని గుర్తు చేశారు. అబద్ధాలతో బహుజనులకు అన్యాయం చేయాలని ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో బిసిల్లోని ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించగలరా? అంటూ ప్రధాని మోడీకి సవాల్ విసిరారు. 56 ఏళ్లుగా ఇవి అమలవుతున్నాయని, ఇప్పుడు మతం ముసుగులో బహుజనుల రిజర్వేషన్లను బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దే నాయకత్వాన్ని గాంధీ కుటుంబం దేశానికి అందించిందని చెప్పారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశ సమగ్రత కోసం కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి రాహుల్ గాంధీ.. భారత్ జోడో యాత్ర నిర్వహించారని తెలిపారు. ఆ సందర్భంగా కులగణన చేసి తీరుతామని తెలంగాణ ప్రజలకు మాట ఇచ్చారనీ, గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే అది శిలాశాసనమేనని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా తెలంగాణలో తాము కుల గణన చేసి చూపించామంటూ చెప్పారు. పక్కా ప్రణాళిక ప్రకారం శాస్త్రీయంగా దాన్ని పూర్తి చేశామని ధీమా వ్యక్తం చేశారు. కులగణన ద్వారా బహుజనుల సంఖ్య 56.33 శాతంగా ఉందంటూ తేల్చామన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధితోపాటు రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు చట్టాలు చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే ఆయనపైనే చూపాలని, అంతేగానీ ఆయన సిద్ధాంతాలపై చూపొద్దంటూ కేంద్రంలోని మోడీ సర్కారుకు హితవు పలికారు. ఇప్పుడు బీజేపీ నేతలు దొంగ ఓట్లతో కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. మహారాష్ట్రలో ఎన్నికల కమిషన్ నాలుగు నెలల్లో కోటి ఓట్లను నమోదు చేసిందని గుర్తు చేశారుతీ రకంగా అంబేద్కర్ పుట్టిన గడ్డ మీద రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు.

దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో బిజెపి అధికారంలోకి వచ్చిందని సిఎం రేవంత్ ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. దేశ నలుమూలలా ఓట్ల చోరీ జరుగుతోందని హెచ్చరించారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని గుర్తు చేశారు. బతికున్న వారిని చనిపోయినట్టుగా చూపారని తెలిపారు. ఈ కుట్రను రాహుల్ గాంధీ బయటపెట్టారని చెప్పారు. తప్పు చేసిన వారిని వదిలేసి తప్పును ప్రశ్నించిన రాహుల్ గాంధీని ఎన్నికల కమిషన్ అఫిడవిట్ అడగటమేంటని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఓటు హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలంటూ రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. త్వరలో తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ పాదయాత్రలో పాల్గొని మద్దతిస్తామని సిఎం వెల్లడించారు. అక్కడే కాదు.. ఇక్కడ కూడా ఓట్ల చోరీ కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్ల అందరం కలిసికట్టుగా ఇలాంటి కుట్రదారుల భరతం పట్టాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ సూచనలను అమలు చేయడం తమ బాధ్యతనీ, ఆ క్రమంలో సమస్య వచ్చినప్పుడు పోరాడేందుకు బహుజనులు నైతిక మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్య ఒక్కటే బహుజనుల తలరాతలు మారుస్తుందని రేవంత్ చెప్పారు. నాణ్యమైన చదువు, ఉద్యోగాలు ఇచ్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ఉద్ఘాటించారు. బహుజనులంతా ఉన్నత చదువులు చదివి రాజ్యాధికారం సాధించాలనీ, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాలనేవి వర్ధంతులు, జయంతుల కోసం కాదనీ, అవి వారి స్ఫూర్తిని మనలో రగిలించిందుకేనని చెప్పారు. అందుకే రాష్ట్రానికి గుండెకాయ లాంటి సచివాలయం సమీపంలో పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.


మాట్లాడుతున్న సిఎం రేవంత్

మా మూల సిద్ధాంతమే సామాజిక న్యాయం : డిప్యూటీ సిఎం భట్టి

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తమ పార్టీ మూల సిద్ధాంతమే సామాజిక న్యాయమని అన్నారు. తెలంగాణలో చేపడుతున్న సంస్కరణలు, నిర్ణయాలు దేశానికే దశ, దిశా, నిర్దేశం చేస్తున్నాయని ఆయన తెలిపారు. భారత చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణనను చేపట్టామని వివరించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మన్ కుమార్, వాకిటి శ్రీహరి, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు కె కేశవరావు, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, బిసి కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రష్మికతో బిర్లా ఓపస్ కొత్త క్యాంపెయిన్

హైదరాబాద్ : ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన బిర్లా ఓపస్ పెయింట్స్ సంస్థ కొత్తగా భారత్‌లో 'బిర్లా ఓపస్ అష్యూరెన్స్' పేరుతో కొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. నటులు విక్కీ కౌశల్, రష్మిక మందన్న బ్రాండ్ అంబాసీడర్లతో కూడిన టివిసి ప్రచారాన్ని ప్రారంభించామని ఆ కంపెనీ ప్రతినిధి ఇంద్రపీత్‌సింగ్ పేర్కొన్నారు.

సంక్షేమానికి కేంద్రం నిధులు ఇవ్వట్లేదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి సామాజిక సంక్షేమ శాఖకు అందాల్సిన నిధులు తగిన విధంగా అందటం లేదని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి అధ్యక్షతన శాఖా పరమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గత ప్రభుత్వంలో దీనిపై సమీక్ష చేయకుండా నాటి పాలకులు నిర్లక్ష్యం చేశారని తెలిపారు.

2047 నాటికి కోటి మందికి ఎఐ ఆధారిత సేవలు

- రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2027 నాటికి కోటి మందికి ఎఐ ఆధారిత పౌర సేవలను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'ఏఐ-లెడ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్- ఛాంపియన్స్ కాటలిస్ట్ ప్రోగ్రామ్' పేరిట ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ (ఐటీ శాఖ) ఆధ్వర్యంలో ప్రభుత్వాధికారులకు హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎఐ సహకారంతో ప్రజలు అడగకుండానే వారి ముంగిటకు పౌర సేవలను చేర్చే సరికొత్త తెలంగాణను నిర్మించాలన్నదే తమ సంకల్పమన్నారు. తెలంగాణ ఐదు బిలియన్ డాలర్ల ఎఐ ఆర్థిక కేంద్రంగా మారడంతో పాటు వేలాది ఉద్యోగాలు సృష్టించబడుతాయని వివరించారు. "ఎఐ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్"గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఎఐ సిటీ, ఎఐ యూనివర్సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఎఐ ఆధారిత తెలంగాణ డేటా సెంటర్‌ను ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచామన్నారు. ఇదే స్ఫూర్తితో 20 ప్రభుత్వ శాఖలకు చెందిన 300 రకాల పౌర సేవలను ఏఐ ఆధారిత ప్లాట్‌ఫాంపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం ఆయా శాఖల నుంచి 250 మంది అధికారులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వారికి మూడు నెలల పాటు ఎఐ నిపుణులు సలహాలు, సూచనలు అందించి మార్గదర్శకత్వం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు, ఐటి ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, డిప్యూటీ సెక్రెటరీ భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వరద బాధితులతో మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద ప్రభావం వల్ల నష్టపోయి ఇబ్బందులు పడుతున్న ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా మంగపేట మండలానికి వచ్చిన సీతక్క మంగపేట, కమలాపురం గ్రామాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం మంత్రి సందర్శించారు. ప్రజలకు మనోధైర్యం చెప్పారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ధైర్యంగా నిలబడాలన్నారు. పునరావాస కేంద్రాలకు తరలిన ప్రజలను కలిసి దుప్పట్లు పంపిణీ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టం అంచనాలు వేయించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు, ఆహారం కొరత లేకుండా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు.


వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి సీతక్క

వరద ముంపు ప్రాంతాల్లో ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. మేడారం జంపన్నవాగు, రామన్నగూడెం పుష్కరఘాట్, గోదావరి కరకట్ట, మంగపేట మండలాల్లోనూ మంత్రి పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులను ఏర్పాటు చేశామన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను సిద్ధంగా ఉంచామన్నారు. ప్రజలు వాగులు, వంకలు దాటొద్దని ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. గోదావరి కరకట్ట పనులు ప్రారంభమయ్యాయని, రాబోయే రోజుల్లో ముంపు ప్రాంతాలకు ఎలాంటి భయమూ లేకుండా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. మంత్రి వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇసార్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, అయ్యోరీ యానయ్య, ముత్తినేని ఆదినారాయణ ఉన్నారు.

కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

- ఈ నెల 20న గచ్చిబౌలిలో ముఖ్యమంతి శంకుస్థాపన
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రలకు మెరుగైన సేవలందించేందుకు రాష్ట్రంలో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించబోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి నాలుగు జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల పరిధిలోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. ఈ నెల 20న గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) ఆవరణలో నిర్మిస్తున్న రంగారెడ్డి, గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నాలుగు కార్యాలయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అలాగే అబ్దుల్లాపూర్, పెద్ద అంబర్‌పేట్, హయత్‌నగర్, వనస్థలిపుం కార్యాలయాలను కోహెడ్‌లో, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ కార్యాలయాలను మహేశ్వరం మండలంలోని మంకాల్‌లో, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కీసర, శామీర్‌పేట్ కార్యాలయాలను కండ్లకోయలో ఉప్పల్, నారపల్లి, కాప్రా, ఘట్‌కేసర్, మల్కాజ్‌గిరి కార్యాలయాలను బోడుప్పల్‌లో బంజారాహిల్స్, ఎస్ఆర్ నగర్, గొల్కొండ కార్యాలయాలను బంజారాహిల్స్‌లో, ఆజంపూరా, చార్మినార్, దూద్‌బౌలి కార్యాలయాలను మలక్‌పేటలో నిర్మిస్తున్నామని తెలిపారు. మరో పదమూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, నాలుగు ఇంటిగ్రేటెడ్ భవనాల కోసం స్థలాలను గుర్తించాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి దశల వారీగా స్లాట్ బుకింగ్ విధానం ప్రవేశ పెట్టామనీ, ఇప్పటి వరకు మూడు లక్షల స్లాట్ బుకింగ్‌లు నమోదయ్యాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖను తమ ప్రభుత్వం ఆదాయ వనరుగా చూడడం లేదనీ, ప్రజలకు సేవలందించే విభాగంగా భావిస్తున్నామని తెలిపారు. మరింత వేగవంతంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేలా రాష్ట్ర వ్యాప్తంగా ఈ-ఆధార్ విధానాన్ని తీసుకురాబోతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ ఆధార్ విధానాన్ని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలవుతోందని వివరించారు.

వర్షాలతో గోదావరి బేసిన్ కళకళ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో చుక్క నీళ్లు లేకున్నా.. మేడిగడ్డ కుంగినా, అన్నారం సుందిళ్లలో నీటి చుక్క ఆపకున్నా.. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలతో గోదావరి బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండటంతో ఉత్తర తెలంగాణలో వరద కాల్వతో పాటు మిడ్‌మానేరు, ఎల్‌ఎండిలో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతున్నాయి. మహారాష్ట్రతో, ఎగువన గోదావరి పరివాహకంలో కురిసిన వర్షాలతో ఎస్ఆర్‌సిపికి మూడ్రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం మధ్యాహ్నం 1.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దాదాపు 76,867 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. కాకతీయ కెనాల్‌కు ఐదు వేల క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 18 వేల క్యూసెక్కుల నీటిని ఇందిరమ్మ వరద కాల్వ ద్వారా మిడ్‌మానేరుకు వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు 18.92 టీఎంసీలకు చేరుకున్నాయి. ఈ ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 20.175 టిఎంసిలు. 148 మీటర్ల గరిష్ట నీటిమట్టం కాగా, ప్రస్తుతం 147.55 మీటర్ల నీటిమట్టం ఉంది. ఈ ప్రాజెక్టు పరివాహకంలో కురిసిన వర్షాలతో 48293 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ తాగునీటితో పాటు ఎన్‌టిపిసికి నీటిని విడుదల చేయటంతోపాటు.. నంది పంపు హౌజ్‌కు 6300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆగస్ట్ 13వ తేదీ నుంచి అయిదు రోజులుగా ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు 4.12 టిఎంసిల నీటిని వదిలారు. మిడ్ మానేరు జలాశయంలో 10.81 టిఎంసిల నీటి నిల్వలున్నాయి. ప్రస్తుత నీటి మట్టం 309.63 మీటర్లు. ఈ నీటి మట్టం 311.14 మీటర్లకు చేరితే.. నీటి నిల్వ 13.13 టిఎంసిలకు చేరుతుంది. అప్పుడు ఒక పంప్ ఆన్ చేయటం వీలవుతుంది. ఇప్పుడున్న ఇన్ ఫ్లో ప్రకారం ఆగస్ట్ 20 నుంచి పంపింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయని ఇరిగేషన్ ఇంజినీర్లు తెలిపారు. మిడ్‌మానేరు నుంచి నాలుగు పంపులు రన్ చేయాలంటే 25.77 టిఎంసిల మేరు నీటి నిల్వ ఉండాలి. ఈ మేరకు సోమవారం సిఎంఒ ఒక ప్రకటన విడుదల చేసింది.

23న చలో హైదరాబాద్

- 20 నెలలైనా అమలు కాని కాంగ్రెస్ హామీలు
- అనివార్య పరిస్థితుల్లోనే ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
- విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
- యుఎస్‌పిసి నేతల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) స్టీరింగ్ కమిటీ విమర్శించింది. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని తెలిపింది. అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఆ హామీలను అమలు చేయలేదని పేర్కొంది. అనివార్య పరిస్థితుల్లోనే ఈ నెల 23న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్టు తెలిపింది. ఉపాధ్యాయులు వేలాదిగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను యూఎస్‌పీసీ నేతలు సోమవారం హైదరాబాద్‌లోని దోమల్‌గూడలో ఉన్న టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ఎ వెంకట్ (టిఎస్‌యుటిఎఫ్), ఎన్ తిరుపతి (టిపిటిఎఫ్), ఎం సోమయ్య, టి లింగారెడ్డి (డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), ఎస్ హరికిషన్ (టిటిఎ), వై విజయకుమార్ (ఎస్‌సిఎస్‌టియుఎస్) మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నూతన జిల్లాలకు డిఇఒ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఇఒ, నూతన మండలాలకు ఎంఇఒ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి వివిధ రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు 5,571 పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని సూచించారు. డిఎడ్, బిఎడ్ అర్హతలున్న ప్రతి ఎస్‌జిటికి పిఎస్‌హెచ్‌ఎం పదోన్నతులకు అవకాశం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పండితులు, పిఇటిల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయినందున 2,3,9,10 జిఒలను రద్దు చేసి 11,12 జిఒల ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని సూచించారు. వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను విడుదల చేయాలని, 2023, జులై ఒకటి నుంచి పిఆర్‌సిని అమలు చేయాలని సూచించారు. 25 జిఒను సవరించాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లుండాలని చెప్పారు. 40 మంది విద్యార్థుల కంటే ఎక్కువున్న ప్రాథమిక పాఠశాలలో తరగతికొక టీచర్ ఉండాలని కోరారు. రూ.398 టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేయాలని సూచించారు. గురుకుల టైంటేబుల్‌ను సవరించాలనీ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అనేక మార్లు ప్రాతినిధ్యం చేసినప్పటికీ మంత్రులు, అధికారుల కమిటీలు వేసినా పరిష్కారం కాకపోవడంతో గతనెలలో దశలవారీ ఉద్యమ కార్యాచరణను చేపట్టాలని యుఎస్‌పిసి నిర్ణయించిందన్నారు. చివరి దశలో ఈనెల 23న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ నాయకులు పి మాణిక్‌రెడ్డి, ఎ సింహాచలం పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మోంట్రా తొలి డీలర్‌షిప్ ప్రారంభం


హైదరాబాద్ : మురుగప్ప గ్రూప్‌నకు చెందిన మోంట్రా ఎలక్ట్రిక్ హైదరాబాద్‌లో తన తొలి విద్యుత్ చిన్న వాణిజ్య వాహన డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. దీన్ని శ్రీరామ్ హర్షతో కలిసి ఏర్పాటు చేసింది. ఈ డీలర్‌షిప్‌లో లాజిస్టిక్స్, కార్గో రవాణా కోసం రూపొందిన అధిక పనితీరు గల ఈవియేటర్ వాహనాన్ని ప్రదర్శించింది. 'హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యుత్ వాహన మార్కెట్, లాజిస్టిక్స్ కేంద్రం ఈ డీలర్‌షిప్‌తో ఉద్గార రహిత, తెలివైన రవాణా పరిష్కారాలను అందిస్తాం' అని మోంట్రా ఎలక్ట్రిక్ ఎమ్‌డి జలజ్ గుప్తా పేర్కొన్నారు.



కేంద్రం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత

- 2.98 లక్షల మెట్రిక్ టన్నుల లోటుతో రైతులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేటాయించిన యూరియాను సరఫరా చేయకపోవడం వల్లే రాష్ట్రంలో కొరత ఏర్పడిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. కేంద్రం తీరు వల్ల రాష్ట్రంలో రూ.2.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడిందని చెప్పారు. దీంతో రైతులకు పంటకు సరపడా యూరియాను సరఫరా చేయలేకపోతున్నామని వివరించారు. రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, సంబంధిత జిల్లా అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏప్రిల్‌లో 1.7, మేలో 1.6, జూన్‌లో 1.7,జులైలో 1.6,ఈనెలలో 1.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందని వివరించారు. కానీ ఏప్రిల్‌లో 1.21, మేలో 0.88, జూన్ లో 0.98, జులైలో 1.43, ఈనెలలో 0.82 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. కేటాయింపుల ప్రకారం రాష్ట్రానికి యూరియాను సరఫరా చేయలేక పోవటం వల్ల రాష్ట్రంలో 2.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడిందని చెప్పారు. దీంతో రైతులకు పంటకు సరిపడా యూరియాను ఒకేసారి అందించలేకపోతున్నామని వివరించారు. లోటును దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత నిల్వలపై పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలనీ, హోల్ సేల్, రిటైల్ డీలర్లు, సహకార సంఘాల గోదాముల్లో రోజువారి యూరియా స్టాక్‌ను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ నుంచి వచ్చే వివరాలను జిల్లా స్థాయిలో సమన్వయం చేసుకుని మండలాల వారీగా అవసరానికి అనుగుణంగా కేటాయింపు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. యూరియా సరఫరాలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెద్ద రైతుల అవసరాలకు విడతల వారీగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైతే పట్టాదారు పాసుపుస్తకాలు అనుసంధానం చేయాలన్నారు. రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి గందరగోళం లేకుండా యూరియా సరఫరా చేయాలనీ, వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా, అన్ని శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, రాష్ట్రాల మధ్య అక్రమ రవాణా అడ్డుకునేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక ధరలకు విక్రయించే లేదా ఇతర ఉత్పత్తులతో కట్టిపెట్టే ప్రయివేట్ డీలర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక అవసరాలకు సబ్సిడీ యూరియా మళ్లించే అవకాశమున్న యూనిట్లపై తనిఖీలు చేసి, వారి ఉత్పత్తి గణాంకాలు, బిల్లులు సరిపోల్చి, ఏమైనా పెద్ద వ్యత్యాసం ఉంటే డీలర్, యూనిట్‌పై కేసులు నమోదు చేయాలన్నారు. మండలాల వారీగా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి, వ్యవసాయశాఖ, పోలీస్, సహకార సంస్థలతో సమన్వయం చేసి పారదర్శకంగా పంపిణీ జరిగేలా చూడాలని అన్నారు. యూరియా సరఫరా సాధారణ స్థితికి చేరేవరకు కఠినంగా పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతిపక్ష నాయకులు మాట్లాడే మాటలకు భయాందోళనలకు గురై యూరియాను అవసరానికి మించి కొనుగోలు చేయొద్దని రైతులను కోరారు.

ఓట్ల గల్లంతుతో ప్రజాస్వామ్యం అపహాస్యం

- బీహార్‌లో ఓట్లు తొలగించడం రాజ్యాంగ విరుద్ధం
- ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో దేశమంతటా విస్తరించేందుకు కేంద్రం కుట్ర : తమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బీహార్‌లో ప్రతిపక్షాలు, మైనార్టీల ఓట్లను గల్లంతు చేయడానికే ఓటు సవరణ పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధానాన్ని తీసుకొచ్చిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో సోమవారం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన పార్టీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. బీహార్‌లో అధికారంలోకి రావడం కోసం తమకు వ్యతిరేకంగా ఓట్లు పడతాయనుకున్న వారి ఓట్లను కేంద్ర ప్రభుత్వం తొలగించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం దానికి తొత్తుగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటనలు కూడా అలానే ఉంటున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక సమగ్ర సవరణ విధానం బీహార్ ఒక్కదానికే పరిమితం కాదని, రేపు భారత దేశమంతటా విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది నకిలీ ఓటర్లను తొలగించడం మాత్రమే కాదని, రాజ్యాంగంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును తొలగించడమని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడూ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. అభ్యుదయవాదులు, ప్రజాస్వామికవాదులు, భారత రాజ్యాంగాన్ని రక్షించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఓటు సవరణ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విధానం ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. ప్రజల ఓటు హక్కును కాలరాస్తూ భారత రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం కలిసి వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

మోడీ, ట్రంప్ ఇద్దరూ స్నేహితులే అయితే భారత్‌పై పదేపదే సుంకాలు ఎందుకు విధిస్తున్నారో..? మోడీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమెరికా - భారత్ వాణిజ్యంలో భాగంగా సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షులు ప్రకటించినా మోడీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని, స్వావలంబనను అమెరికా సామ్రాజ్యవాదానికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నింటిలో ప్రత్యేకించి అమెరికాలో కూడా నిరసన వెల్లువలు కొనసాగుతున్నాయని, ఇది శుభ పరిణామమని అన్నారు. ప్రజా తిరుగుబాటులో సామ్రాజ్యవాద పెట్టుబడుదారీ శక్తులు తోక ముడవక తప్పదని హెచ్చరించారు.

వర్షాలతో వ్యాధులు ప్రబలే అవకాశం

రాష్ట్రంలో వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సదుపాయం ప్రజలకు అందుబాటులో ఉండేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తమ్మినేని కోరారు. జిల్లా కేంద్రం ఆస్పత్రులతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లను ఏర్పాటు చేసి సరిపడా మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధుల నుంచి ఏజెన్సీ ప్రాంత ప్రజలను కాపాడటానికి తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో మాజీ ఎంపి మీడియం బాబురావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం జ్యోతి, ఎంబి.నర్సారెడ్డి, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాదిన సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థి జెఎసి డిమాండ్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

దక్షిణ భారతదేశంలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటుచేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి,యువజన జెఎసి, తెలంగాణ విద్యార్థి జెఎసిలు డిమాండ్ చేశాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కూడా దక్షి నాదిన నిర్వహించాలని కోరాయి. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థి, యువజన జెఎసి అధ్యక్షులు రాయపాటి జగదీష్ మాట్లాడుతూ ఆర్‌బిఐ సిబిల్ స్కోర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు ఈశాన్య రాష్ట్రాల్లో హైకోర్టు బెంచ్‌లు ఉన్నాయని, దక్షిణ భారతదేశంలో సుప్రీంకోర్టు బెంచ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రధాని మోడీని ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఎంపిలందరు ప్రధానిపై ఒత్తిడి తీసుకొచ్చి సుప్రీం కోర్టు బెంచ్ సాధించాలని కోరారు. కేంద్రం స్పందించకపోతే యువత, విద్యార్థులు ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తారని తెలిపారు. తెలంగాణ విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఆమనగల్ రాజు మాట్లాడుతూ, అంబేద్కర్ జాతీయ సహకార బ్యాంకు ఏర్పాటు, విద్యార్థి సమస్యల మీద ఉమ్మడి పోరాటం చేస్తామన్నారు. ఎపి విద్యార్థి జెఎసికి మద్దతుగా ఉంటామని తెలిపారు కార్యాక్రమంలో కొమ్ము రాజు, సూర్య, సాగర్, కృష్ణ బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ సిఎంతో భేటీ అయిన అద్దంకి దయాకర్, చనగాని దయాకర్

ఉద్యోగాల భర్తీకి సిద్ధం

- వారంలో నిరుద్యోగులతో భేటీ : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సిఎంతో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ భేటీ అయ్యారు. ఉద్యోగాల భర్తీతో పాటు నిరుద్యోగులతో భేటీ కావాలని వారు సూచించారు. వారి సూచనకు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నిరుద్యోగుల సమస్యలు వినడానికి సిద్ధంగా ఉన్నామనీ, వారం రోజుల్లో ప్రజా భవన్‌లో వారితో భేటీ అవుతామని భట్టి మాటిచ్చారు.

ప్రజా సంక్షేమం దిశగా పాలన

- ఎమ్మెల్యే భూపతి రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమం దిశగా పాలన సాగుతోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజా ప్రతినిధుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. దాదాపు 40కి పైగా వినతులు రాగా అందులో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, వివిధ సమస్యలను ప్రజలు విన్నవించుకున్నారు. ప్రజల సమస్యలు విన్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధుల కార్యక్రమం ఏర్పాటు చేసిన టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సామాన్యుడి ధిక్కార స్వరం సర్దార్ సర్వాయి పాపన్న

- జయంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాధికారం గురించి సామాన్యుడు ఆలోచించడానికి సాహసించని కాలంలో.. ఏకంగా గోల్కొండ రాజ్యాన్ని ఏలిన సామాన్యుడు.. బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని పలువురు వక్తలు కొనియాడారు. పాపన్న 375వ జయంతిని సోమవారం కల్లుగీత కార్మిక సంఘం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్తంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం టిపిఎస్‌కె హాల్‌లో టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. పన్నులకు వ్యతిరేకంగా 12 మందితో తన పోరాటాన్ని ప్రారంభించి 12 వేల మంది సైనిక శక్తిని పెంచిన పరిపాలనాదక్షులు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. కెజికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ మాట్లాడుతూ.. పాపన్న చరిత్రను ప్రజలకు తెలియజేసేందుకు.. వారి పుట్టుక నుంచి వీరుడుగా నేలకొరిగే వరకు చరిత్రను దృశ్యీకరించినట్టు చెప్పారు. పల్లెల్లో పాపన్న జైత్రయాత్ర సభలు, సమావేశాలు నిర్వహించి.. ఆయన వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించామని, వాటిని ప్రభుత్వం గుర్తించి నేడు పాపన్న విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని చెప్పారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తాబేదారులు, జమీన్‌దారులు, జాగీర్దారులు, దొరలు, భూస్వాముల దురాగతాలను పాపన్న గమనించి గోల్కొండ కోటపై బడుగుల జెండాను ఎగురవేయాలని నిర్ణయించి ఆ దిశగా ప్రస్థానం ప్రారంభించారన్నారు. మొగల్ చక్రవర్తిని గడగడలాడించిన బహుజన వీరుడు పాపన్న అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెజికెఎస్ రాష్ట్ర కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు, గౌడ/వృత్తి సంఘాల అధ్యక్షులు అంబాల నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ధర్నా చేస్తున్న మహబూబాబాద్ రైతులు

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి మండల కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. మహబూబాబాద్ పిఎసిఎస్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్ మాట్లాడుతూ రైతులకు వెంటనే యూరియా అందించాలని డిమాండ్ చేశారు. యూరియాను ఎక్కువ మోతాదులో దిగుమతి చేసుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా సరఫరా చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.4.36లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే రైతులకు వచ్చిందని తెలిపారు. దీనిపై ప్రభుత్వాలు స్పందించి పెండింగ్ యూరియా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ మండల వ్యవసాయ అధికారి తిరుపతి రెడ్డి, మహబూబాబాద్ టౌన్ ఎస్ఐ వచ్చి ఘటనా స్థలానికొచ్చి ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు సరిపడా యూరియా అందుబాటులోకి తెస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

ఐఇడి పేలి జవాన్ మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భోపాల్‌పట్నం పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఉల్లూర్ సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలడంతో ఓ జవాన్ ప్రాణం కోల్పోయారు. ముగ్గురు డిఆర్‌జి సైనికులు తీవ్రంగా గాయపడ్డారని జిల్లా ఎస్‌పి జితేంద్ర యాదవ్ తెలిపారు. మరణించిన డిఆర్‌జి జవాన్ దినేష్‌నాగ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. బస్తర్ ఐజి సుందర్‌రాజ్, పోలీసు అధికారి కమ్లోచన్ కశ్యప్, పోలీసు అధికారులు నివాళి అర్పించారు. జవాన్ కుటుంబాన్ని ఓదార్చారు. అన్ని విధాలుగా సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గాయపడిన జవాన్లకు చికిత్స కొనసాగుతోంది.

గొంతులో కోడి గుడ్డు ఇరుక్కుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భోజనం చేస్తుండగా గొంతులో కోడి గుడ్డు ఇరుక్కొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజమూరి ఈశ్వరయ్య (60) రాత్రి భోజనం చేసే సమయంలో కోడి గుడ్డు తిన్నారు. అది గొంతులో ఇరుక్కుని ఊపిరి ఆడటం కష్టమైంది. కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో తండ్రీకొడుకు మృతి

- సిద్దిపేట జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు రోజుల కిందటే ఆ ఇంట్లో ఆడపిల్ల వివాహం వైభవంగా జరిగింది. ఆ ఆడపిల్లను ఓ ఇంటి కోడలిని చేశామని తండ్రి, అన్నయ్య సంతోషంలో ఉన్నారు. కానీ వారి సంతోషం ఎక్కువ రోజులు నిలువలేదు. పంటకు రక్షణ కోసం వైర్లను కడుతుండగా.. ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతం జరిగి తండ్రీ కొడుకులు ప్రాణం కోల్పోయారు. దాంతో ఆ కుటుంబంతోపాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని చంద్లాపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూర్తి గజేందర్‌రెడ్డి (55), రాజేందర్‌రెడ్డి (26) తండ్రీకొడుకులు. ఈ నెల 14న గజేందర్‌రెడ్డి కుమార్తె వివాహం చేశారు. అయితే, గంగాపూర్ గ్రామంలో తన వ్యవసాయ పొలం వద్ద మొక్కజొన్న పంటను కుక్కలు, కోతులు, అడవి పందుల నుంచి రక్షించుకోవడానికి సోమవారం తండ్రీ కొడుకులు వైరు కడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ గద్దె దగ్గరలో ఉండడంతో ఎర్త్ పాపై కరెంట్ షాక్ కొట్టింది. దాంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. దాంతో చంద్లాపూర్, గంగాపూర్ గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాన్ని మాజీ ఎంపిపి కూర మాణిక్యరెడ్డి పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రాష్ట్ర కాంగ్రెస్ అసమర్థపాలన

- గుజరాత్‌కు తరలిన రూ2,800 కోట్ల పెట్టుబడులు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి చేతకాని పాలనతో గుజరాత్‌కు రూ.2,800 కోట్ల 'కేన్స్' పెట్టుబడి గుజరాత్‌కు వెళ్లిపోయిందని ఆరోపించారు. దీంతో రేవంత్ సర్కార్ తెలంగాణ యువతకు చెందిన ప్రత్యక్షంగా 2 వేల ఉద్యోగాలకు గండి కొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీకి రాష్ట్రాన్ని ఎటిఎంలా వాడుకుంటున్న కాంగ్రెస్ గత బిఆర్‌ఎస్ శ్రమను బూడిదలో పోసిన పన్నీరుగా మారుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

పరిశ్రమలు తరలిపోతున్నా సిఎం రేవంత్ రెడ్డిలో చలనం కనిపించడం లేదని కెటిఆర్ విమర్శంచారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రమతో కర్ణాటకు వెళ్లాల్సిన కేన్స్ పరిశ్రమను తెలంగాణకు రప్పించిందని తెలిపారు. ఆ పరిశ్రమకు పది రోజుల్లోనే కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ పక్కనే భూములు కేటాయించినట్టు గుర్తుచేశారు. బిఆర్‌ఎస్ పారదర్శక పాలన, చిత్తశుద్ధితో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన ఆ సంస్థ కాంగ్రెస్ అవినీతి కారణంగానే రాష్ట్రం విడిచి వెళ్లిపోయిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఆటో పైలెట్ మోడ్‌లో ఉందన్న సిఎం రేవంత్ రెడ్డి కేన్స్ తరలింపుపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక తెలంగాణ స్వయం విధ్వంసక మోడ్‌లోకి వెళ్లిందని ఆరోపించారు. తాము తెచ్చిన బ్రాండ్ హైదరాబాద్, బ్రాండ్ తెలంగాణ ఇమేజ్‌ను నిలబెట్టుకోలేదనీ, కమిషన్ల మీదే తప్ప పరిశ్రమలను కాపాడుకోవడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి శ్రద్ధ లేదని తప్పుపట్టారు. రాష్ట్రాభివృద్ధి, ఉద్యోగాల కల్పన గాలికొదిలేసిన రేవంత్ రెడ్డి తన సిఎం పదవి కాపాడుకోవడానికి ఢిల్లీ పెద్దలకు తెలంగాణను తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఎస్-ఐపాస్ వంటి విప్లవాత్మక విధానాలతో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రపంచస్థాయి కంపెనీలను ఆకర్షించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో కేన్స్ టెక్నాలజీ సంస్థ గుజరాత్‌కు తరలిపోవడం ఒక హెచ్చరిక మాత్రమేననీ, ఇప్పటికైనా రేవంత్ సర్కార్ కళ్లు తెరవకపోతే మరిన్ని సంస్థలు తరలిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారించాలని సూచించారు.

స్థానిక సంస్థల నిధుల మంజూరుకు 21న ధర్నాలు

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు నిధులను మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 21న తహశీల్దార్, జిహెచ్‌ఎంసి, జిఎంసి కార్పొరేషన్, మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థలకు నిధులను మంజూరు చేయకపోవడం వల్ల పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని తెలిపారు. మురికి కాలువలు శుభ్రం చేయడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగాయని వివరించారు. డెంగీ, మలేరియా తదితర జ్వరాలతో బాధపడుతున్నారని, కొందరు జ్వరాల బారిన పడి చనిపోతున్నారని, ఈ సమస్య పట్ల అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. స్థానిక సంస్థలకు నిధులను వెంటనే మంజూరు చేసి ప్రజలను అనారోగ్యం నుంచి కాపాడాలని కోరారు.


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సతీష్

పెద్దపల్లి కలెక్టరేట్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

- కలెక్టర్ సమక్షంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధి నిర్వహణలో తండ్రి మరణించగా.. ఆ ఉద్యోగం కోసం అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు పెద్దపల్లి కలెక్టరేట్‌లో సోమవారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. యువకుడిని గమనించిన సిబ్బంది వెంటనే అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి చికిత్స కొనసాగుతోంది. అతను కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన సతీష్‌గా గుర్తించారు. కిష్టంపేట ఉన్నత పాఠశాలలో తాత్కాలిక స్వీపర్‌గా పనిచేసిన సతీష్ తండ్రి.. విధి నిర్వహణలో పాము కాటుకు గురై ప్రాణం కోల్పోయాడు. తండ్రి మరణం అనంతరం అతడి ఉద్యోగాన్ని తనకు ఇవ్వాలని సతీష్ పలుమార్లు అధికారులను వేడుకున్నాడు. కానీ, ఎలాంటి స్పందనా రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇదే క్రమంలో కలెక్టరేట్‌కు వచ్చి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు.

నేడు 'మౌనసాక్ష్యాలు' గ్రంథావిష్కరణ

- ఫోటో జర్నలిస్ట్ కేశవులుకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోటో జర్నలిస్టు కేశవులుకు అరుదైన గౌరవం లభించింది. ఆయన తీసిన వార్తా ఫోటోలపై పరిశోధన చేసి ప్రత్యేక గ్రంథాన్ని డాక్టర్ సత్యవోలు సుందరసాయి రచించారు. నాలుగు దశాబ్దాల కాలంలో కేశవులు అనేక రకాల ఫోటోలను తీసి ప్రజల ముందు ఉంచారు. చాలా ఫోటోలు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించాయి. ముఖ్యంగా మానవత్వం, పేదరికంపై ఆయన తీసిన ఫోటోలు అనేక అవార్డుల్ని గెలుచుకున్నాయి. సమాజ హితం, లౌక్యం, రాజకీయం, వ్యంగ్యం, విమర్శ, విషాదం, హాస్యం ఇలా తనదైన శైలిలో ఫోటోలను నిక్షిప్తం చేశారు. వృత్తిపట్ల అంకితభావం, ప్రతిభ, సమాజం పట్ల బాధ్యతను ఆయన తన ఛాయా చిత్రాల ద్వారా ప్రజలకు పరిచయం చేశారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 'సృజనభారతి' సంస్థ ఆధ్వర్యాన మంగళవారం రవీంద్రభారతిలో సాయంత్రం ఆరు గంటలకు 'మౌన సాక్ష్యాలు' గ్రంథాన్ని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత డాక్టర్ సత్యవోలు సుందరసాయి మాట్లాడుతూ కేశవులు తీసిన న్యూస్ ఫోటోలు పొటో జర్నలిజానికి మార్గదర్శకంగా నిలవాలనే సంకల్పంతో ఈ పుస్తకాన్ని రాసినట్టు తెలిపారు.

అస్సోంలో బాల్య వివాహాల నిరోధక చర్యలు భేష్

- కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అస్సోంలో బాల్య వివాహాల నివారణకు తీసుకున్న చట్టపరమైన చర్యలు మెరుగైన ఫలితాలనిచ్చాయని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి తెలిపారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా అస్సోం అని ఆ రాష్ట్రం ప్రకటించిన తర్వాత ఆ రాష్ట్రంలో తీసుకున్న చర్యలను అధ్యయనం చేసేందుకు సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులతో అక్కడ పర్యటించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ఆ రాష్ట్రంలో కౌమార దశలో ఉన్న బాలికల పునరావాసం, సాధికారత కోసం నిజుత్ మొయిన పథకాన్ని అమలు చేస్తున్నారని వెల్లడించారు. అక్కడి బాల్య వివాహాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చట్టబద్ధ ఏజెన్సీలు, డిసిపిఇ, సిడిపిఇ, పోలీసులు, న్యాయవ్యవస్థ, అస్సోం రాష్ట్ర బాల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతినిధులతో ముచ్చటించినట్టు తెలిపారు. మరిగావ్ జిల్లాలో ప్రత్యేకంగా చేపట్టిన నూతన వ్యూహాలను, పకడ్బందీ చర్యలను అధ్యయనం చేసినట్టు చెప్పారు. దీంతో బాల్య వివాహాల నిరోధ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ పర్యటనలో కమిషన్ సభ్యులు వచన కుమార్, అపర్ణ, వందన గౌడ్, చందన, సరిత, ప్రేమలత అగర్వాల్ పాల్గొన్నారు.

24న వికలాంగుల వాయిస్ 11వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తూ, చట్టాలు, సంక్షేమ పథకాలపై వికలాంగులను చైతన్యం చేస్తున్న వికలాంగుల వాయిస్ మాస పత్రిక 11వ వార్షికోత్సవాన్ని ఈనెల 24న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్‌ను అవిష్కరించినట్టు ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2015లో వికలాంగుల వాయిస్ మాస పత్రికను ప్రారంభించామని తెలిపారు. 11 ఏళ్లుగా వికలాంగుల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం తీసుకురావడానికి పత్రిక కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేశ్, కమిటీ సభ్యురాలు పి.శశికళ పాల్గొన్నారు.

20 నుంచి సిపిఐ రాష్ట్ర 4వ మహాసభ

- ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన : కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గాజుల రామారంలోని మహారాజ గార్డెన్స్‌లో ఈ నెల 20 నుంచి 22 వరకు 3 రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 743 మంది ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులతో కలుపుకుని 1,000 మంది వరకు మహసభలో పాల్గొంటారని తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుంచి మహసభ వేదిక మహారాజ గార్డెన్స్ వరకు రెడ్ ఫ్లాగ్ మార్చ్ ఉంటుందనీ, 10 గంటలకు పార్టీ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి అరుణ పతాకాన్ని ఎగురవేస్తారనీ, అనంతరం నవ చేతన పబ్లిషింగ్ హౌజ్ ఏటుకూరి ప్రసాద్, అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటలకు మహాసభలను సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, సౌహార్ద ప్రతినిధులుగా సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, సిపిఎం రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరు కానున్నారని కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. మహాసభల ప్రాంతానికి ఎఐటియుసి సీనియర్ నాయకులు పొట్లూరి నాగేశ్వరావు నగర్‌గా, ఆ ప్రాంగణానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దివంగత ఎన్ బాలమల్లేష్ పేరును, భోజనశాలకు మేడ్చల్ జిల్లా నాయకులు దివగంత రోయ్యల కృష్ణమూర్తి, కె సహదేవ్‌ల పేర్లను పెట్టినట్టు వెల్లడించారు. మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోనున్నట్టు తెలిపారు. మతోన్మాద, ఫాసిస్టు విధానాలను అనుసరిస్తున్న బిజెపిని గత ఎన్నికల్లో 240 సీట్లకు కట్టడి చేయడంలో కమ్యూనిస్టుల కీలకపాత్ర పోషించారని కూనంనేని తెలిపారు. 20 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని హామీలను నెరవేర్చిందనీ, మరిన్ని హామీలను నెరవేర్చాల్సి ఉందన్నారు. ఆర్‌టిసిలో ఎన్నికలు నిర్వహించకపోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించే ప్రయత్నాలకు, అసంఘటిక కార్మికుల హక్కుల కోసం పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎంతో పొత్తు ఉంటుందనీ, అదే విధంగా కాంగ్రెస్ తోనే స్నేహబంధం కొనసాగుతుందన్నారు. అత్యంత ప్రమాదకర పార్టీ బీజేపీని నిలువరించడమే తమకు ముఖ్యమన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధులకు తగిన గుర్తింపునిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాటి చెట్టుపై నుంచి కింద పడి గీత కార్మికుడు ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గీత కార్మికుడు నల్లమాస శంకరయ్య (58) ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. కల్లు దించే క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడి అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు.